క్లుప్తంగా

పరీక్షాపే చర్చపై అవగాహన

చీమకుర్తి: ప్రధాన మంత్రి ఇంటరాక్టివ్ ప్రోగ్రాం పరీక్షాపే చర్చ కార్యక్రమంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని ఎంఈఓలు, హెచ్ఎంలకు డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షాపే చర్చ కార్యక్రమానికి సంబంధించి 6 నుంచి 12వ తరగతి వరకు గల విద్యార్థులకు నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలపై గత నెల 12 నుంచి ఈనెల 12 వరకు విద్యార్థుల పేర్లు నమోదు చేసుకునే ప్రక్రియ జరుగుతుందన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

చీమకుర్తి: గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ (జీటీఏ) ఆధ్వర్యంలో మంగళవారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులో 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సమష్టి కృషితో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేద్దామని సభ్యులకు హెచ్ఎం సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు.

12 మద్యం బాటిల్స్ స్వాధీనం

కొత్తపట్నం: అక్రమంగా విక్రయిస్తున్న మందు బాటిల్స్‌ను ఎస్సై బి. సాంబశివరావు తమ సిబ్బందితో దాడి చేసి నిందితుడిని పట్టుకున్నారు. ఈతముక్కల గ్రామానికి చెందిన సోమ నరేష్‌బాబు గ్రామంలో తను ఇంటి దగ్గర అమ్ముతున్నాడు. సమచారం తెలుసుకున్న ఎస్సై ఇంటికెళ్లి పట్టుకున్నాడు. తమ దగ్గర 12 బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పశ్చిమ ప్రకాశాన్ని ఆదుకోవాలి


కేంద్ర మంత్రికి వినతి పత్రం అందిస్తున్న శివా రెడ్డి

ఒంగోలు సెంట్రల్: తీవ్ర వర్షాభావంతో పశ్చిమ ప్రకాశంను ఆదుకోవాలని జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పీవీ శివారెడ్డి అన్నారు. ఒంగోలు అతిథి గృహంలో మంగళవారం కేంద్ర, మత్స్య కార పశుసంవర్ధక మంత్రి పురుషోత్తం రూపాలాను కలిశారు. యర్రగొండ పాలెం, గిద్దలూరు, మార్కాపురం , కనిగిరి అసెంబ్లీ ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న విషయాలను వివరించారు. పశుసంవర్ధక శాఖ ద్వారా గ్రాసం, ట్యాంకర్‌ల ద్వారా నీటి సరఫరా, యుతకు ఉపాధి కోసం డైరీ ఫాంలు , గేదేలు, మేకలు సంబంధిత జిల్లా అధికారులకు రుణ సౌకర్యం కల్పించే విధంగా చర్యలను తీసుకోవాలని కోరారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఉలవపాడు: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలో జాతీయరహదారి పై ఉలవపాడు ఉత్తర బైపాస్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు.. ఉలవపాడు కుచెందిన మొగిలి శ్రీను, చెంచయ్యలు ఉలవపాడు కు ద్విచక్రవాహనం పై వస్తున్న సమయంలో ఉలవపాడు నుండివీరేపల్లికి వెళుతున్న మరో ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీను, చెంచయ్యలు గాయాలయ్యాయి.

16 మద్యం బాటిళ్లు స్వాధీనం

టంగుటూరు: మండలంలోని ఆలకూరపాడు గ్రామంలో పోకూరి వెంకటేశ్వర్లు అక్రమ మద్యం అమ్ముతుండగా పలు రకాల 180 ఎంఎల్ 16 మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు ఎస్సై ఖాదర్ బాషా మంగళవారం తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచునన్నట్లు చెప్పారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

14 బాటిళ్లు

మార్కాపురం టౌన్: పట్టణంలోని రాజ్యలక్ష్మి కాలనీలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి 14 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

మొక్కలు నాటడంపై శ్రద్ధ చూపాలి

గిద్దలూరు రూరల్: మొక్కలు నాటడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకుడు మాగులూరి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని సంజీవరాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

దగా చేసిన చంద్రబాబును నమ్మరు

- నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు టౌన్: డ్వాక్రా రుణాలను రద్దు చేస్తామని చెప్పి మోసం చేసిన చంద్రబాబును మహిళలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మరని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. మంగళవారం మారుతి నగర్ సచివాలయం వద్ద జగనన్న ఎందుకు ముఖ్యమంత్రి కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పథకాల ద్వారా 14.62 కోట్ల రూపాయల లబ్ధి పొందిన వారి వివరాలతో కూడినబోర్డును ఆమె ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మేయర్ ప్రసంగిస్తూ 600 హామీలతో నాడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో కనీసం ఆరు హామీలను కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఒంగోలులో ఇళ్లు కట్టించి ఇస్తామంటూ నిరుపేద ప్రజల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి ఒక్క ఇంటిని కూడా నిర్మించకుండా పోయారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు పేదలకు ఇళ్ల పేరుతో మోసం చేసిన దామచర్ల జనార్దన్ ఇప్పుడు చింతల దగ్గర టిడ్కో ఇళ్ల పేరుతో రాజకీయాలు


పింఛన్లను పంపిణీ చేస్తున్న మేయర్


కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

చేయడం సిగ్గుచేటని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఎందుకు ఇళ్లు నిర్మించి ఇవ్వలేదో జవాబు చెప్పాలని ప్రజలు అతడిని నిలదీసి ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటిలోనూ నవరత్నాల వలన లబ్ధి పొందిన ప్రజలున్నారని, కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత జగనన్నకు మాత్రమే దక్కుతుందని చెప్పారు. తెలుగు దేశం పాలనలో పేదల బతుకులు మారలేదని, ధనవంతులు మాత్రం ఇంకా ధనవంతులుగా మారారని సచవాలయ కన్వీనర్ భూమినేని మురళి అన్నారు. పాదయాతలో పేదల కష్టాలను స్వయంగా చూసిన జగనన్న నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల కోసం పాటుపడుతున్నారని చెప్పారు. ఒంగోలు నగరాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీని వాసరెడ్డి అభివృద్ధి చేశారని, కానీ సిగ్గులేని తెలుగు దేశం నాయకులు మాత్రం మేము చేశామని చెప్పుకుంటూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఒంగోలు నగరాన్ని ఎవరు అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసన్నారు. ఇన్ని పథకాలను అమలు చేస్తున్నా అవినీతి లేదని, సచివాలయాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరుగా ప్రజలు లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రజల మనసెరిగిన నేత జగనన్నకు ప్రజలు మరోసారి అండగా నిలబడాలని కోరారు. డివిజన్‌లో కనీవినీ ఎరుగని అభివృద్ధి జరిగిందని, త్వరలోనే మంచినీటి సమస్య కూడా పరిష్కారం అవుతుందని కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాలరెడ్డి చెప్పారు. అను నిత్యం ప్రజల కోసం ఆలోచిస్తున్న ప్రజానేత జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలను కోరారు. వల్లపు చెంచురెడ్డి, ఎం. అంకయ్య, బెల్లంకొండ అశోక్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం డివిజన్‌లో కొత్తగా పింఛన్లు మంజూరైన గోపిశెట్టి మాల్యాద్రి, తంగినేని రమణమ్మ, పల్లపోలు శిరిషలకు 3 వేల రుపాయల పింఛన్‌ను అందజేశారు.

గోదాదేవికి సారె సమర్పణ


గోదాదేవికి సారెను సమర్పిస్తున్న శిద్దా లక్ష్మీపద్మావతి


సారె సమర్పణ కార్యక్రమానికి హాజరైన మహిళలు

చీమకుర్తి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో గోదాదేవి అమ్మవారికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీపద్మావతి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు సారె సమర్పించారు. అమ్మవారికి విశేష పూలు, పండ్లు, వెండి గంగాళం, సువర్ణ ముక్కెర, బొట్టు, కాటుక వారు సమర్పించిన సారెలో ఉన్నాయి. సారె సమర్పణకు తొలుత శ్రీవేణుగోపాలస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా సారెను హరిహరక్షేత్రం వద్దకు తీసుకువచ్చారు. అమ్మవారికి తిరుప్పావై సేవలతో పాటు విశేష పూజలను నిర్వహించారు. అనంతరం పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళా భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, పట్టణంలోని మహిళలు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

నాగులుప్పలపాడు: తమ పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని పశు సంర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబీరాణి అన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా అందిస్తున్న గాలికుంటు టీకాల కార్యక్రమం మంగళవారం ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడులో ప్రారంభించిన అనంతరం జేడీ మాట్లాడారు. అన్ని గ్రామాల్లో ఈ రోజు నుంచి ఈ నెల 31వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. మంగళవారం 250 పశువులకు టీకాలు వేయించామని ఏడీఏ నాగభూషణరావు తెలిపారు.


ఉప్పుగుండూరులో టీకాల ప్రక్రియ పరిశీలిస్తున్న జేడీ బేబీరాణి

డీడీ డాక్టర్ పద్మావతి, పశు వైద్యులు జాస్మిన్, లావణ్య, రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

పొన్నూరుకు పూర్ణకుంభ పురస్కారం

ఒంగోలు మెట్రో: రాజరాజ నరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని గైట్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 5,6,7 తేదీల్లో నిర్వహిస్తున్న రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు 5వ తేదీ ఆదికవి నన్నయ వేదికపై ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, స్వర్ణ కంకణ గ్రహీత పొన్నూరు వేంకట శ్రీనివాసులకి పూర్ణకుంభ పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు గజల్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్ నుంచి ఆహ్వానం అందినట్లు తెలిపారు. అదే రోజు ఆదికవి నన్నయ వేదికపై నిర్వహించే వాగ్గేయకార సాహితీ సదస్సులో ప్రముఖ తెలుగు వాగ్గేయకారుడు రామదాసు సాహిత్యం పై ప్రసంగిస్తున్నట్లు తెలిపారు. గత 60 సంవత్సరాలుగా ప్రకాశం జిల్లా రచయితల సంఘం తెలుగు సాహిత్యానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా తనకు పూర్ణకుంభ పురస్కారాన్ని ప్రకటించినట్లు తెలిపారు. అంతర్జాతీయ తెలుగు మహాసభలలో పురస్కారాన్ని అందుకోవటంతో పాటు సాహితీ సదస్సులో ప్రసంగిస్తూ ప్రకాశంజిల్లా సాహిత్య కీర్తిని ఇనుమడింపజేస్తున్న పొన్నూరు వేంకట శ్రీనివాసులును ప్రకాశంజిల్లా రచయితల సంఘం కార్యదర్శి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యత్తపు కొండారెడ్డి, కోశాధికారి కె.వి.రమణారెడ్డి, కార్యవర్గ సభ్యులు, ముస్లిం రచయితల సంఘం అధ్యక్షులు షేక్ మహబూబ్ జాన్, అన్నమయ్య సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు ఐ. మురళీకృష్ణ, అక్కినేని కళాపరిషత్ అధ్యక్షులు కల్లగుంట కృష్ణయ్య, అక్షర సాహితీ సమితి అధ్యక్షులు ఎంవీఎస్ శాస్త్రి, విశ్వ కళాభారతి అధ్యక్షులు నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వర శర్మ, ఒంగోలు కల్చరల్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు మా మూర్తి, ఎర్రన్న సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, పలు సంగీత, సాహిత్య, సాంస్కృతిక, కళాసంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.


ఆధ్యాత్మిక ప్రవచకులు పొన్నూరు శ్రీనివాసులు

ఎంపీ సహకారంతో రోడ్ల మరమ్మతులు


కందులూరులో డొంక రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న పొక్లెయిన్

టంగుటూరు: మండలంలోని కందులూరు గ్రామంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సమకూర్చిన పొక్లెయిన్‌తో జంగిల్ క్లియరెన్స్, చెత్త తొలగింపును మంగళవారం ప్రారంభించారు. చెరువుకొమ్ము పాలెం డొంకకు ఇరువైపులా చిల్లచెట్లను తొలగించి, గ్రామంలో ఉన్న అన్ని పొలాల డొంకలను జిల్లా గొర్రెల పెంపకందారుల చైర్మన్ బొట్ల రామారావు ఆర్థిక సహకారంతో బాగు చేస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. బొట్ల సుబ్బారావు, ఎంపీటీసీ అరితోటి దొరబాబు, ఉప్పలపాటి శ్రీనివాస రాజు, పసుమర్తి సుప్రియ, బాబు, మనోజ్, బొడ్డు వేణు, భాను, బాబులు, చిరమని వేణు తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా జీవించాలి

- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉషాబాల
- 172 మందికి వైద్య పరీక్షలు

రంగాయపాలెం (కొత్తపట్నం): అంతా ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం, గ్రామం, రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందని జిల్లా నోడల్ అధికారి వాణిశ్రీ అన్నారు. రంగాయపాలెం సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత డాక్టర్ ఎం.వైష్ణవి ఆధ్వర్యంలో రంగాయపాలెం సర్పంచ్ గాలి స్వరూప, పాదర్తి సర్పంచ్ కట్టా సౌందర్య రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ముందుగా హెల్త్ క్యాంప్‌ను సందర్శించి ఓపీల విభాగం, మందులు పంపిణీ, ఆరోగ్యశ్రీ రెఫరల్ కౌంటర్‌లను పరిశీలించారు. వాణిశ్రీ మాట్లాడుతూ రిస్ట్రేషన్ లేని వారికి స్పాట్ రిజిస్ట్రేషన్ చేయాలని మెడికల్ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గైనకాలజీ స్పెషలిస్ట్ ఉషాబాల, సర్పంచ్ గాలి స్వరూప, చిల్డ్రెన్‌స్పెషలిస్ట్ డాక్టర్ జోషణ, ఈఓఆర్డీ ఏ.బాలచెన్నయ్య, గాలి మునలారెడ్డి, జిల్లా మైనార్టీ కార్యదర్శి షేక్ కరిముల్లా, ఎంఎల్‌హెచ్‌పీ (సీహెచ్‌వో) ?ఝాన్సీ, సీహెచ్‌వో ఓంకార్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వాణిశ్రీ, సౌందర్య, స్వరూప

సీపీఐ నాయకుడు చంద్రశేఖర్ మృతి

ఒంగోలు టౌన్: నగర సీపీఐ సహాయ కార్యదర్శి బొమ్మిశెట్టి చంద్రశేఖర్ మంగళవారం తెవారుజామున మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆర్య వైశ్య కుటుంబంలో పుట్టి కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులైన చంద్రశేఖర్ చిన్న వయసు నుంచే పార్టీ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. కొండపి మండలంలోని పెరదేపి గ్రామానికి చెందిన ఆయన విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్‌లో క్రియాశీలకంగా పని చేశారు. చంద్రశేఖర్ సోదరులు కూడా కమ్యూనిస్టు పార్టీలో పనిచేయడం విశేషం. ఆయనకు భార్య ఇద్దరు సంతానం ఉన్నారు. మృతదేహంపై ఎర్రజెండాను కప్పి నివాళుర్పించారు. ఎంఎల్ నారాయణ, నల్లూరి వెంకటేశ్వరరావు, చంద్రనాయక్, పీవీఆర్ చౌదరి, ఎం. వెంకయ్య, వసుంధరా దేవి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ బాబు తదితరులు పాల్గొన్నారు.


చంద్రశేఖర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


బహుమతులు అందజేస్తున్న మేనేజర్ మురళీకృష్ణ

పామూరు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు మేనేజర్ మురళీకృష్ణ అన్నారు. స్థానిక తెలుగుబాప్టిస్ట్ చర్చిలో మంగళవారం సాయంత్రం చర్చి పాస్టర్ ఆర్.జోసఫ్ అధ్యక్షతన క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన ఆటలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఇంటింటికీ రామ మందిరం అక్షతలు

ఒంగోలు మెట్రో: అయోధ్య రామ మందిరంలో పూజ చేసినటువంటి మంత్ర అక్షతలను స్థానిక ఒంగోలు నగరంలోని రాజీవ్ నగర్ ప్రాంతంలో ప్రతి ఇంటికి పంచడం కోసం గాను బ్రాహ్మణ వృద్ధాశ్రమ భవన ప్రాంగణంలో మంగళవారం చేపట్టారు.భుజంగరావు ధేనువకొండ సుబ్బయ్య, ధూళిపాళ్ల కోటేశ్వర శర్మ గుండ్లపల్లి లక్ష్మీదేవి, మొక్కపాటి ఆదిలక్ష్మి, ఈదర లక్ష్మి, మొదలగువారు పాల్గొని ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంత కోదండరామ స్వామి దేవాలయంలో జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వారి సూచన మేరకు మంగళవారం ఉదయం పది గంటల నుంచి శ్రీరామ శిలా పూజిత పరమ పవిత్రమైన అక్షతలు సత్యనారాయణపురం దిబ్బల రోడ్డు కూరగాయల మార్కెట్ దగ్గర వెలసి ఉన్న శ్రీ అనంత కోదండ రామస్వామి వారి దేవాలయ మందిరంలో శుద్ధిచేసి ఆ ప్రాంతంలోని దేవాలయాలకు అందించే కార్యక్రమం వైభవంగా జరిగినది. ఈ కార్యక్రమానికి స్థానిక హిందూ బంధువులు భక్తులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.


అయోధ్య రామ మందిరం అక్షింతలతో స్థానిక భక్తులు

తెలంగాణ ఓటర్లకు అవకాశం ఇవ్వొద్దు


మాట్లాడుతున్న ఇస్మాయిల్, రవిచంద్ర

- సబ్ కలెక్టర్‌కు వైఎస్సార్ సీపీ నేతల విజ్ఞప్తి

మార్కాపురం: తెలంగాణ రాష్ట్రంలో ఓటు హక్కు కలిగిన వారికి ఆంధ్రప్రదేశ్‌లో ఓటేసే అవకాశం కల్పించవద్దని, డబుల్ ఓట్ల తొలగింపునకు తగిన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ రాహుల్‌మీనాకు మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి పత్తి రవిచంద్ర కోరారు. మంగళవారం సాయంత్రం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొందరు ఓటర్లు తెలంగాణాలో నివాసముంటూ మార్కాపురంలో ఓటు నమోదు చేయించుకున్నారని, డబుల్ ఓటర్లను తొలగించాలని కోరారు. సంచారజాతుల వారికి కూడా ఓటు హక్కు కల్పించాలని వారు గత కొన్నేళ్లుగా మార్కాపురం పట్టణంలో నివసిస్తున్నారని, ఆధార్ కార్డు ఓటరు కార్డుతో అనుసంధానం కాకపోవడంతో ఓటు హక్కును తొలగించేందుకు సిద్ధమవుతున్నారని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. డబుల్ ఎంట్రీ ఓటర్లను గుర్తించే పనిలో ఉన్నామని, అలాంటి వారందరికీ నోటీసులు ఇచ్చామని తెలిపారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు తాళ్లపల్లి సత్యనారాయణ, షేక్ మౌలాలి, అందె నాసరయ్య, సుదర్శన్, డి.చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై సోమవారం అర్ధ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ఇసుక దరిశి సమీపంలో జరిగింది. 108 సిబ్బంది నాగేశ్వరమ్మ వివరాల మేరకు.. విజయవాడకు చెందిన గొలుసు సూరిబాబు తిరుపతి నుంచి ఆటో నడుపుకుంటూ విజయవాడ వెళ్తున్నాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో సూరిబాబు ఆటోను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి బలంగా ఢీ కొట్టి వెళ్లిపోయింది. ప్రమాద ధాటికి రహదారిపై పడిన సూరిబాబు దవడ, గడ్డం ఎముకలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ప్రమాదస్థలికి చేరుకొని సూరిబాబును మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

సావిత్రి బాయి పూలే చిత్రపటం బహూకరణ

కొత్తపట్నం: ఈ నెల 3న సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న సీహెచ్ కోటేశ్వరరావు సావిత్రి బాయి పూలే చిత్ర పటాన్ని మంగళవారం పాఠశాలకు బహూకరించారు. గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ డ్రాయింగ్ వేయటం, మహా నేతలు, ఉద్యమ నేతలు వంటి చిత్రపటాలను తను చేతులతో వేసి పాఠశాలలకు బహూకరిస్తాడు. అందులో భాగంగా సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా చిత్ర పటాన్ని రంగులతో వేసి పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీదేవి మాట్లాడుతూ ఈ నెల 3న సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా పాఠశాలలో వేడుకగా జరగాలని కోరారు. భారత దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రి బాయి పూలే పనిచేసిందని అందువలన ఉపాధ్యాలంతా వేడుకగా జరుపుకోవాలన్నారు. సావిత్రి పూలే చిత్ర పటాన్ని వేసి బహూకరించిన కోటేశ్వరరావును ఆమె అభినందించారు.


పూలే చిత్రాన్ని గీసి బహూకరిస్తున్న కోటేశ్వరరావు

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై పరిశీలన

సీఎస్‌పురం(పామూరు): పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగనున్న దృష్ట్యా మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను సెక్టార్ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అంబవరం, కొత్తపల్లి, చెన్నపునాయునిపల్లి, వి.బైలు, అయ్యలూరివారి పల్లె కేంద్రాలను సెక్టార్ ఆఫీసర్ రాజాల కొండారెడ్డి, శీలంవారిపల్లి, ఆనికాలపల్లి, నల్లమడుగుల, గుంతచెన్నంపల్లి, పుల్లగూరపల్లి, ఉప్పలపాడు పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారి జి.సంజీవి పరిశీలించారు. డీజీపేట, బోయమడుగుల, వెంకటాయచెరువు, కొండబోయినపల్లి పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారి ఆర్.శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి వసతి, ఫర్నీచర్, ర్యాంపులు, ప్రహరీలు వంటి సదుపాయాలు ఉన్నాయా, లేదా అనే అంశాలను పరిశీలించినట్లు సెక్టార్ అధికారులు తెలిపారు. ర్యాంపుల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సదుపాయాలను ఎస్ఎంఎఫ్ నిధులను వినియోగించి వెంటనే ఏర్పాటు చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మరో 10 రోజుల్లో మరోమారు కేంద్రాలను తనిఖీచేస్తామని వారు పేర్కొన్నారు.

వారసత్వ సంస్కృతిని భావితరాలకు తెలపాలి


వీరారెడ్డిని సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు

మార్కాపురం: మన వారసత్వ, సంస్కృతి సంపదను ముందు తరాలకు తెలపాల్సిన బాధ్యత కవులపై ఉందని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాల సుబ్బారావు, విశ్రాంత డీవైఈఓ మల్లికార్జునరావు పేర్కొన్నారు. మంగళవారం విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశంలో మన ఊర్ల కథలు పుస్తకాన్ని రచించిన డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డిని ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. పశ్చిమ ప్రకాశంలో ప్రసిద్ధ గ్రామాల చరిత్రను ప్రజలకు అర్థమయ్యేరీతిలో రచించి పుస్తక రూపంలో విడుదల చేయడం అభినందనీయమన్నారు. రచయిత వీరారెడ్డి మాట్లాడుతూ.. ఈ పుస్తకాలను పాఠశాలలకు అందిస్తున్నానన్నారు. అనంతరం కొత్త ఇన్‌కం టాక్స్ విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత డీవైఈఓ సాయిలీల, రిటైర్డు ప్రిన్సిపాల్స్ వెంకటరెడ్డి, రామిరెడ్డి, నారాయణరెడ్డి, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.